# సం“పాత”కీయం

‘నమస్కారం మపాసా గారూ!’ బస్సెక్క బోతున్నవాణ్ణి తియ్యని గొంతుకతో పలకరింపు విని, దిగిపోయాను.

రమామణి అని-నాకో విసనకర్ర. (అంటే ఫ్యాన్)

నేనేది రాసినా మెచ్చుకునే అలవాటు ఆమెకి.

ఓసారి మా యింటికే వచ్చి అభినందించింది. మా ఆవిడ కసిగా ఎవరా వన్నెల విసినికర్ర ? అంది, ఆమె వెళ్ళిపోయాక.

రోజుకి రెండు చీరలు మారుస్తుంది. వారానికో పేస్టు మారుస్తుంది. అంచేత వన్నెల విసినికర్ర సరైందేనని చెప్పాను. మా ఆవిడ ప్రశ్నకి సమాధానం యివ్వకుండా తప్పించుకుని.

“ఈ నెల ‘చంద్రిక’లో మీ కథ చాలా మూవింగ్‌గా వుందండి” అంది.

చంద్రికలో నా కథ యేదీ కూడా అచ్చు వెయ్యడానికి కాకపోతే రిటర్న్ చెయ్యడానికీ పెండింగు లేదు; ఆ మాటే చెప్పాను.

"అదేంటండీ అలాగంటారు?" అని కథ పేరు చెప్పింది మ పా సా అని స్పష్టంగా అచ్చు వేశారుట.

"కాని నేను కథలు నా అసలు పేరుతో (మండా పార్థసారథి) అనే రాస్తున్నాను. గాని మ పా సా అని రాయడంలేదుగా" అన్నాను.

ఆవిడ నమ్మలేదు. ఇంతలోకే ఆవిడ యెక్కవలసిన బస్సు వొచ్చింది. నన్ను బాధలో వొదిలేసి తను అందులో వెళ్ళిపోయింది.

చచ్చినట్టు పక్కనే వున్న బుక్ షాపులో చంద్రిక కొన్నాను, మూడు రూపాయలు పోసి.

అందులో నా పొడి అక్షరాలతో కథ వొకటుంది.

ఇంటికెళ్ళే లోపల కథ చదువుకున్నాను. చాలా హృదయ విదారకమైన కథే. చంద్రిక పత్రికవారు కథల పోటీపెట్టి న్యాయ నిర్ణేతృత్వం వహించమని యాడాది కిందట నాకో అయిదువందల కథలు పంపేరు. అందులో ప్రచురణార్హమైనవిగా గుర్తెట్టి పత్రికాధిపతులకు అందజేసిన కథల్లో వొకటి అది.

సంపాదకులు దాన్ని నా పేరుతో అచ్చువేసి యాభైవేలమంది పాఠకులకి ఆ అసలు రచయిత పేరును (కనీసం తాత్కాలికంగా) మరుగు పరచారు.

ఈ కీర్తి బరువుగా వుంది. ఇంతకంటె ఏ సాహిత్య అకాడమీ వారో బహుమతి ఇచ్చేసినా తేలిగ్గా వుండేది.

లెటర్స్ ఏమయినా వున్నాయా అని అడుగుతూ చెప్పులు విప్పాను, ఇంట్లో ప్రవేశిస్తూనే

'ఆ' అని ఒక కవరు అందించింది శ్రీమతి.

"—తమరు పేరు ప్రఖ్యాతులు గల రచైతలు, ఇంత నీచానికి వొడిగడ్తారని అనుకోలేదు. నావంటి ఔత్సాహిక రచయితల కథలు న్యాయ నిర్ణేతృత్వం పేరుచెప్పి యాభయ్యో వందో దాచుకుని ఒక్కొ

క్కడే పత్రికలకి పంపుతున్నారన్నమాట. మీరెంత బుద్ధిహీనులు కాక పోతే మేం వెయ్యికళ్ళతో కనిపెట్టి చూసే చంద్రిక పత్రికకే ఆ కథ పంపుతారు.

ఫోన్ మోగింది ప్రక్క వాటాలో. "మీకే అనుకుంటాను" అంటూ దగ్గిరిగా వొచ్చింది మా ఆవిడ. "డాక్టర్ వెంబు, మీరు రాసిన కథేదో చాలా బావుందని చెప్పేడు. ఇందాకానూ మీతో డయిరెక్టు గానే చెప్పడానికి మళ్ళీ ఫోన్ చేస్తానన్నారు."

అదే అయింది.

ఫలానా జి. యస్. రామయ్యగారు అండమాన్‌లో స్పెషల్ పోస్టుకి విశాఖపట్నం నించి వెళ్ళిపోతున్నారని న్యూస్ ఐటంవేసి పైన బ్రిటిష్ ప్రధాని క్యాలహాన్ ఫొటో ముద్రించిన సంపాదకులున్నారు.

పింగళి నాగేంద్రరావుగారు చనిపోయిన వార్తవేసి దానిపైన చక్రపాణిగారి బొమ్మ ముద్రించిన సంపాదకులున్నారు.

అరబ్ రాజ్యంలో ఎవరో ప్రముఖుడు హత్య చెయ్యబడితే ఆ వార్తకు పైన నేపాల్‌రాజు ఫొటో వేసిన సంపాదకులున్నారు.

అంతమంది మధ్య, నేను రాయని కథకి నా పేరు తగిలించిన వారు (సం)పాదకు లెలా అవుతారు? వచ్చే నెల్లో అసలు రచయిత పేరు వేస్తార్లే అని మా ఆవిడని వూరడించబోయి, అన్యాపదేశంగా నన్నే వూరడించుకున్నాను.

"అప్పుడైనా మీ పేరు లక్షసార్లు అచ్చవుతుంది. అతని పేరు యాభై వేల సార్లే అచ్చవుతుంది" అని నవ్వింది మా ఆవిడ.

"నీ తెలివి తేటలు అమోఘం" అన్నాను, ఏడుపు పర్యంతం అయి.

(27-5-78)